క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్, తాతీలు

కరప: గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నాలుగు కుటుంబాలకు విశ్రాంత చీఫ్ లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు రూ.35 వేలు ఆర్థిక సాయం చేశారు. గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న కరపలోని కొత్తపేటవీధికి చెందిన దేవు బాబూరావుకు రూ.10 వేలు, మెరకవీధికి చెందిన ఉప్పలపాటి వెంకన్నబాబుకు మందుల కోసం రూ.5 వేలు, షుగర్ వ్యాధిగ్రస్తుడైన గొల్లపల్లి నరసింహమూర్తికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, దివ్యాంగుడు రెడ్డి పోతురాజు జీవనోపాధికి రూ.10 వేలు సాయమందించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు వినతి మేరకు వారికి శ్రీనివాస్ ఈ ఆర్థిక సాయం చేశారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ



హైస్కూల్‌కు సౌండ్ సిస్టం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టంను పూర్వ విద్యార్థులు బహుకరించారు. పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో 2023– 24 విద్యార్థులు రూ.15 వేల విలువైన సౌండ్ సిస్టంను పూర్వ విద్యార్థిని జి.భవిత చేతుల మీదుగా శనివారం అందజేశారు.

కరపలో పేరెంట్స్ టీచర్స్ మీట్



నడకుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బుల్లికృష్ణవేణి

కరప: మండలంలోని నడకుదురు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ కె.బుల్లి కృష్ణవేణి ఆధ్వర్యంలో టీచర్స్, పేరెంట్ మీట్ నిర్వహించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి, సోషల్‌వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ, హెచ్ఎం వాకాడ వెంకటరమణ తల్లిదండ్రులతో కల్సి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే మండల పరిధిలోని 56 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018



కరపలో స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు తదితరులు



రామారావుపేట శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో కుమారస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వైభవంగా సుబ్బారాయుడి కల్యాణం

- భక్తి శ్రద్ధలతో షష్ఠి వేడుకలు
- ఉదయం నుంచే స్వామికి అభిషేకాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

బోట్‌క్లబ్: సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి సందర్భంగా శనివారం నగరంలోని స్వామి వారి ఆలయాల్లో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు, పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలోని స్వామివారి ఆలయాల్లో వైభవంగా పూజలు చేశారు. ఆలయ ఈఓ రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. స్థానిక సంతచెరువుగట్టు వద్ద ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. అలాగే స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు విశేషపూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయం ప్రాంగణంలోని సుబ్రహ్మణేశ్వరస్వామికి, స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుడి గుడి సమీపంలోని నాగేంద్రస్వామికి భక్తులు విశేష పూజలు చేశారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామి వారికి కావడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రపాలెంలో పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: మండలంలోని సుబ్బారాయుడు షష్ఠి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఇంద్రపాలెంలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలకు భక్తులు తెల్లవారు జాము నుంచి పోటెత్తారు. ఆలయ ఈఓ జోగా సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు భక్తులకు ఏర్పాటు చేయగా ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు, సిబ్బంది బందోబస్తు నిర్వమించారు. సుమారు 25 వేల మంది భక్తులు దర్శనాలు చేసుకున్నట్టు ఈఓ సత్యనారాయణ తెలిపారు.

తమ్మవరంలో..

తమ్మవరం గ్రామంలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. పలువురు భక్తులు అరటి గెలలను స్వామి వారికి సమర్పించారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, వలసపాకల గంగరాజు నగర్, పలు గ్రామాలలో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి.

కరపలో ఆలయాలు కిటకిట

కరప: మండలంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గొర్రిపూడిలో తుల్యభాగ నదీతీరాన ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. కోలసంబరం, బుర్రకథ, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి ఆలయధర్మకర్త గండి వెంకట్రాజు, రామాదేవి దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కరపలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త చాగంటి వెంకట్రావు కుటుంబ సభ్యులతో అర్చకులు పూజలుచేయించారు. వేళంగిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణం చేశారు. వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఏర్పాట్లు చేశారు.

51 అడుగుల స్వామికి పూజలు

కరప, పెనుగుదురు గ్రామాల మధ్య సిరిపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు నిర్మించిన 51 అడుగుల వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద వేదపండితులు ఆగమశాస్త్ర ప్రకారం చిక్కాల దొరబాబు, సావిత్రి దంపతులు, సుబారావు, అనూరాధ దంపతులతో పూజలు చేయించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, వజ్రపు కామేశ్వరరావు, మార్శెళ్ల వెంకటరమణ, గొర్రెల శ్రీనివాస్ తదితరులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాన్నదానంలో 15 వేల మంది పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కరప ఎస్ఐ టి.సునీత బందోబస్తు నిర్వహించారు.



కరపలోని 51 అడుగుల సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



తమ్మవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అభివృద్ధిపై అవగాహన లేని మాటలేల?

- అసమర్థతను స్వయంగా అంగీకరిస్తున్నారు
- ఎమ్మెల్యే వనమాడిపై ద్వారంపూడి ధ్వజం

కాకినాడ: గత ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై అవగాహన లేకుండా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. అధికారులు తన మాట వినడం లేదని చెప్పడం ద్వారా తాను ఒక అసమర్థ ఎమ్మెల్యే అని కొండబాబు ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆరు నెలల పాలనలో వనమాడి కొండబాబు పాలన అసమర్థంగాను, అవినీతికి చిరునామగా మారిందన్నారు. ప్రజల సౌకర్యార్థం కాకినాడ వంటి నగరంలో టీడీఆర్ బాండ్ల ద్వారా స్థలాన్ని సేకరిస్తే జీర్ణించుకోలేక అర్థంలేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అనేక ప్రభుత్వ శాఖల అధికారుల సిఫార్సుతో ప్రభుత్వ అనుమతితో భూమిని సేకరిస్తే అవినీతి ఆరోపణలు చేయడం కొండబాబుకే చెల్లిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మాదిరిగా ప్రజల అవసరాల కోసం ఒక ఎకరం అయినా సేకరించగలిగారా అని నిలదీశారు. బాండ్ల జారీపై విజిలెన్స్ కాదు సీబీఐ విచారణ అయిన జరిపించుకోవచ్చునన్నారు. తప్పుడు డాక్యుమెంట్లతో 45 ఎకరాలను తన కుటుంబ సభ్యుల పేర్లతో కైంకర్యం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. హైదారాబాద్ సమీపంలోని 55 ఎకరాల స్థలాన్ని అమ్మి కాకినాడలో ఐశ్వర్య గ్రాండ్ స్థలాన్ని బ్యాంక్ ఆక్షన్ ద్వారా తాను కొనుగోలు చేశానని, దీనిని కూడా తప్పు పట్టడంపై మండిపడ్డారు. జయలక్ష్మి కోపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు న్యాయం చేసేందుకు స్వయంగా ముఖ్యమంత్రిని కలిసి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయించానని, యాజమాన్యానికి సంబంధించిన 3 వందల కోట్ల ఆస్తులను కూడా గుర్తించి బాధితులకు న్యాయం చేసే ప్రయత్నం చేశానన్నారు. ప్రభుత్వంలోకి వచ్చి 6 నెలలు గడిస్తున్నప్పటికీ బాధితులకు కొండబాబు ఏం చేశారని నిలదీశారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు తాను 650 ఎకరాలను సేకరించి 30 వేల మందికి పట్టాలు ఇచ్చానని, ఆ స్థలాల్లో ఇంటి నిర్మాణాలకు రూ.10 వేల చొప్పున లంచాలు అడుగుతున్నారని కొండబాబుపై మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో గంజాయి వంటి మత్తు పదార్థాలను నియంత్రించేందుకు ఎంత పరితపించానో అప్పట్లో పనిచేసిన ఎస్పీలను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. ఎగ్జిబిషన్ల నిర్వహణకు రూ.25 లక్షలు వసులు చేసిన ఘనత కొండబాబుకే దక్కుతుందన్నారు. పీడీఎస్ బియ్యం వ్యాపారస్తుల నుంచి నెలనెలా రూ.5 లక్షలు, ఆయిల్ మాఫియా నుంచి రూ.7 లక్షలు, కొన్ని పెట్రోల్ బంకుల నుంచి నెలవరి మామూళ్లతో సహా ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని కొండబాబుపై మండిపడ్డారు. చరిత్రలో ఎన్నాడు లేని విధంగా లక్షలు దిగమింగి సింగిల్ నెంబర్ లాటరీలను ప్రోత్సహిస్తున్నారంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక ఓఎన్‌జీఎస్ పరిహారం, మత్స్యకార భరోసా వంటి ఏ ఒక్క హామీ ఊసు ఎత్తకుండా అక్రమ సంపాదనపైనే కొండబాబు దృష్టి సారించారన్నారు. వనమాడి అవినీతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ దృష్టి పెట్టాలని సూచించారు. తనపై ఎన్ని నిరాధారమైన ఆరోపణలు చేసినా పట్టించుకోనని, అయితే రోజులన్ని ఒకేలా ఉండవని కొండబాబు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రామారావు

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బర్రె నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ నేడు ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ కావడం వల్ల అనేక మూగజీవాలు చనిపోతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇళ్లకు సరుకులు తీసుకుని వెళ్లేందుకు ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించడంతో రోడ్ల పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి వాటిని తిన్న మూగ జీవులు చనిపోతున్నాయన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను రామారావు అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ మూర్తి మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. తులసమ్మ, భారతి, శాంతి, తాతారావు, రామారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

మీడియా ద్వారా ప్రభుత్వోద్యోగి సంజాయిషీ

- సర్పంచ్ ఆరోపణలపై జూనియర్ అసిస్టెంట్ ఘనకార్యం
- చర్యలు తీసుకుంటామంటున్న ఎంపీడీఓ

కాకినాడ రూరల్: ఆయనొక గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ (గుమస్తా). కొన్ని నెలల క్రితమే బదిలీపై తిమ్మాపురం వచ్చారు. విధి నిర్వహణలో అలసత్వంపై ఆయనపై ఆరోపణలు రావడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శికి సర్పంచ్ ఫిర్యాదు చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై అధికారులకు సంజాయిషీ ఇవ్వాల్సిన సదరు జూనియర్ అసిస్టెంట్ మీడియా సమావేశం పెట్టి వివరణ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌కుమార్‌పై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ శుక్రవారం ఫిర్యాదు చేశారు. వృద్ధుల పింఛన్ల పంపిణీలో జాప్యం, ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీ ఖాతాకు ఆలస్యంగా జమ చేయడం, కొత్తగా ఇంటి పన్నులు వేసేందుకు సొమ్ములు డిమాండ్ చేయడం వంటివి ప్రధాన ఆరోపణలు. దీనిపై అధికారులు వివరణ కోరితే జూనియర్ అసిస్టెంట్ సంజాయిషీ ఇవ్వాల్సి ఉంది. అలా కాకుండా మరుసటి రోజే శనివారం పంచాయతీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి సర్పంచ్ ఆరోపణలకు జూనియర్ అసిస్టెంట్ కౌంటర్ ఇచ్చారు. దీనిపై ఎంపీడీఓ పి.సతీష్ వివరణ కోరగా జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్‌కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేయకూడదని, అలా చేయడం తప్పే అవుతుందని పేర్కొన్నారు. సర్పంచ్ ఫిర్యాదుపై పంచాయతీ కార్యదర్శికి వివరణ ఇవ్వాలి గానీ, మీడియాకు ఎక్కడంపై చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి విరాళాలు

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టరేట్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం కలెక్టర్, జిల్లా సైనిక వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షణ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు సంక్షేమం కోసం ఫ్లాగ్ డే సందర్భంగా మనం అందించే విరాళాలు ఒక మంచి కార్యక్రమానికి ఉపయోగపడతాయని కలెక్టర్ అన్నారు. వ్యక్తులు, సంస్థలు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం వారి పేరుపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్ శాఖ, కాకినాడ బ్రాంచ్‌లోని ఖాతా సంఖ్య 62064060623, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐ ఎన్0020974 నేరుగా జమ చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ విరాళాలు అందించే వారికి ఆదాయం పన్ను నుంచి మినహాయింపులు వర్తిస్తాయన్నారు. అనంతరం తన వంతుగా విరాళం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ సత్యప్రసాద్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటైన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలసి ఆయన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ స్థాయి వరకూ చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సెంటర్ నోడల్ అధికారిగా విపత్తులు నిర్వహణ శాఖ ప్రాజెక్టు మేనేజర్ వ్యవహరిస్తారని, సభ్యులుగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ, మున్సిపల్ కార్పొరేషన్, పౌరసరఫరాలు, భూగర్భ గనులు, ఎక్సైజ్, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, దేవదాయశాఖ అధికారులు ఉంటారని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, సీపీఓ పి.త్రినాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.దేవులా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళం అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్


విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీఎస్పీ కమాండెంట్ దీపిక

కాకినాడ రూరల్: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు కమాండెంట్ దీపిక శనివారం బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీలో పీసీ రమేష్ ప్రథమ స్థానంలోను, ఆర్ఎస్సై టీవీ నారాయణరెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని కమాండెంట్ దీపిక అభినందించారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తిమ్మాపురం ఎస్సై తదితరులు

కాకినాడ రూరల్: మాదక ద్రవ్యాల మహమ్మారి బారిన పడితే జీవితం నాశనమవుతుందని తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసులు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, మహిళల భద్రత, వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెత్తిన పడి ఉంటే ఇక పైకే!

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- బాత్రూంలో పెచ్చులు పడి కమోడ్ తునాతునకలు
- ప్రమాదం నుంచి తప్పించుకున్న మహిళా పీజీలు
- కాకినాడ జీజీహెచ్‌లో ఘటన

కాకినాడ క్రైం: శనివారం కాకినాడ జీజీహెచ్‌లో మహిళా పీజీ వైద్యులకు పెను ప్రమాదం తప్పింది. సర్జికల్ బ్లాక్‌లో ఉన్న ట్విన్ ఆపరేషన్ థియేటర్ (టీవోటీ) కాంప్లెక్స్‌లో ఫిమేల్ పీజీ రూంలోని బాత్‌రూంలో ప్రమాదం జరిగింది. సీలింగ్ నుంచి ఓ భారీ సిమెంట్ పెచ్చు ఊడి సరిగ్గా లేవెట్రీ కమోడ్‌పై పడింది. బరువైన ఈ సిమెంట్ పెచ్చు పడిన ధాటికి బలమైన సిరామిక్ కమోడ్ తునాతునకలైంది. కమోడ్‌పై కూర్చొని ఉన్న సమయంలో అదే సిమెంట్ పెళ్ల నెత్తిన పడి ఉంటే మరణం తథ్యమనే అభిప్రాయం ఆ భయానక ఘటనను చూసిన వారిలో వ్యక్తమవుతోంది. అప్పటికి కొద్ది నిమిషాల ముందు ఆ బాత్రూం వినియోగించిన వైద్యులతో పాటు శుభ్రం చేయడానికి వచ్చిన శానిటేషన్ వర్కర్ బతుకు జీవుడా అంటూ వణికిపోయారు.



సిమెంట్ పెచ్చు ఊడిపడి తునాతునకలైన కమోడ్

విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

కాకినాడ సిటీ: విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. గాడిమొగలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో జిల్లా విద్యార్థులకు శనివారం నిర్వహించిన ధీరూబాయ్ అంబానీ క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్విజ్ మాస్టర్ నేతృత్వంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతలు అందజేశారు. ఏపీ మోడల్ స్కూల్ శంఖవరం విద్యార్థులు వై.బాలమురళి, ఎస్.స్వాతి విన్నర్లుగా నిలిచారు. వీరికి 2 ల్యాప్‌టాప్‌లు అందించారు. రన్నర్లుగా ఉండూరు జెడ్పీ హైస్కూల్ నుంచి సుధీర్, కుమార్, యువీ గీతామధు నిలిచారు. వీరికి ట్యాబ్‌లు అందించారు. మున్సిపల్ హైస్కూల్ వెంకటనగర్, ఎంసీ బాయ్స్ హైస్కూల్ పరదేశమ్మపేట, కోటనందూరు, రాపర్తి, తొండంగి హైస్కూల్స్ విద్యార్థులకు 10 సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సైట్ హెడ్ ఎల్.మురళీధర్, సీఎస్ఆర్ హెడ్ పోతాప్రగడ సుబ్రహ్మణ్యం, ఎస్.ప్రియకుమార్, ఐ.శ్రీనివాస్, డీఈవో రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న డీఈవో రమేష్